సాక్షి
వరంగల్
శుక్రవారం | 20 | జనవరి | 2023



'ఐటీ హబ్'కు నిర్లక్ష్యపు వైరస్

వరంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యమనే వైరస్ పట్టింది. ఓరుగల్లు నగరం మాత్రం కేవలం నాలుగు కంపెనీలకే పరిమితమైంది. - 8లో▸



ఖమ్మం సభ గ్రాండ్ సక్సెస్

ఖమ్మంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30.0^0 / 18.0^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆదాయాన్నిచ్చే పంట 'ఆయిల్‌పామ్'

జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు



దుగ్గొండి: లాభదాయకమైన ఆయిల్‌పామ్ పంట సుదీర్ఘకాలం పాటు ఆదాయాన్ని ఇస్తుందని జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు అన్నారు. తొగరురామయ్యపల్లి గ్రామంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాడిచెట్టు రవి సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల చుట్టూ నీరు నిల్వకుండా చూడాలన్నారు. నీరు ఎక్కువైతే మొక్క చనిపోయే ప్రమాదం ఉందన్నారు. లీటరు నీటికి గ్రాము బావిస్టిన్ మందును కలిపి మొక్క మొగి తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో నాటింది 10 శాతం కూడా కాదన్నారు. నాలుగేళ్లకే చేతికొచ్చే పంట కావడంతో రైతులు సాగుకు మొగ్గు చూపాలన్నారు. ఆయన వెంట హెచ్ఓ జ్యోతి, జెన్ డ్రిప్ ఇరిగేషన్ ప్రతినిధి రాజమౌళి ఉన్నారు.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ర్యాంకు



చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన మండల నిహారిక జాతీయ స్థాయి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించింది. నిహారిక బీఎస్సీ(అగ్రికల్చర్) తోపాటు పీజీ పూర్తి చేసింది. ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు జాతీయ స్థాయిలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష నిర్వహించగా.. ఆలిండియా స్థాయిలో 141వ ర్యాంకు సాధించింది. ఓబీసీ విభాగంలో 46వ స్థానంలో నిలిచింది. అలాగే సాయిల్ సైన్స్ విభాగంలో నిహారిక ఐదు స్థానాల్లో మొదటి స్థానంలోనే హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం పరిశోధన విభాగంలో సీటు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కాగా.. నిహారిక ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు శోభ, మల్లయ్య, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టండి'



రాయపర్తి: రైతులు పశుసంపదను కాపాడుకోవడంతోపాటు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని జింకురాంతండాలో బాలాజీ గోశాల ఆధ్వర్యంలో పది మంది రైతులకు ఉచితంగా లేగదూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవు పేడ, మూత్రం ద్వారా తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చన్నారు. దీనిని సేంద్రియ ఎరువుగా వినియోగించుకుని ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కములేకర అరవింద్, ఆఫీస్ సూపరింటెండెంట్ దుర్గం రోజా, గోరక్ష సమితి సభ్యుడు ఏరుకొండ రాము, జనగామ జిల్లా అధ్యక్షుడు బానోతు గణేష్, సర్పంచ్ సుందర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గోశాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సెంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ స్పోర్ట్స్: భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా సెంటర్(జీఎంసీ బాలయోగి స్టేడియం), హైదరాబాద్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 18 ఏళ్ల వయసున్న వారు 2023–24 సంవత్సరానికి ఆర్చరీలో బాలికలు, అథ్లెటిక్స్‌లో బాలబాలికలు, హాకీలో బాలబాలికలు, కబడ్డీలో బాలుర, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ఎల్బీనగర్ నందు జిమ్నాస్టిక్స్ బాలబాలికలకు ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు జనవరి 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జరిగే ఎంపికలకు హాజరు కావాలని సూచించారు.

జలం.. తగ్గుముఖం

రబీలో వరి నాట్లతో పెరిగిన నీటి వినియోగం

- ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇంకా తగ్గే అవకాశం
- నీటి పొదుపు పాటిస్తే మంచిదంటున్న అధికారులు
- జిల్లాలో అవగాహన కల్పిస్తున్న భూగర్భ జలవనరుల శాఖ



జిల్లాలో నీటిమట్టం మీటర్లలో..

మండలం	మే	అక్టోబర్	నవంబర్	డిసెంబర్
చెన్నారావుపేట	1.40	0.11	0.70	1.25
దుగ్గొండి	4.00	0.49	1.27	1.95
గీసుకొండ	4.70	0.86	1.73	1.97
ఖానాపురం	4.32	1.57	2.03	2.81
నల్లబెల్లి(మేడపల్లి)	4.58	0.61	1.60	2.36
నర్సంపేట	5.66	1.70	2.37	3.68
నెక్కొండ(అమీనొపేట)	3.05	0.05	0.50	1.05
పర్వతగిరి	11.75	5.25	5.39	6.60
రాయపర్తి	7.61	1.00	1.72	2.70
సంగెం	3.83	2.00	2.70	2.95
వర్ధన్నపేట	7.76	4.97	5.44	6.97
వరంగల్ (చార్‌బౌలి)	3.68	1.26	1.91	2.14
ఖిలావరంగల్ (మామునూరు)	5.53	0.79	1.27	1.87

సాక్షి, వరంగల్: జిల్లాలో సాగునీటి కాల్వలు, బావుల కింద రబీ సీజన్‌లో వరి నాట్లు జోరందుకున్నాయి. దీంతో ఇప్పటివరకు నీరునిలకడగా ఉండగా.. క్రమేపీ వినియోగం పెరుగుతుండటంతో జలమట్టం తగ్గుతోంది. భూగర్భ జలాలకు ఎలాంటి డోకా లేకున్నా.. ఉన్న నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయ, భూగర్భ జలవనరుల శాఖఅధికారులు అంటున్నారు.2022 వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. దీంతో భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. అంతకుముందుతో పోలిస్తే వచ్చే వేసవిలో నీటి కష్టాలు అంతగా ఉండవని అర్థమవుతోంది.అయితే ఉన్న నీటిని కాపాడుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండవనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా..ఇప్పటికే జల వనరుల శాఖ దీనిపై దృష్టి సారించింది. మొత్తం 1,06,622 ఎకరాలకు.. రబీలో 50,530 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు.

పొదుపుగా నీరు వాడాలి..

జిల్లాలో అక్టోబర్‌లో 1.79 మీటర్లు, నవంబర్‌లో 2.34 మీటర్లు, డిసెంబర్‌లో 3.13 మీటర్లకు జలమట్టం పడిపోయింది. వచ్చేది వేసవి కాలం కావడంతోపాటు పంటలకు ఎక్కువగా నీటి వాడకం ఉండడంతో భూగర్భ జలమట్టం మరింతగా పడిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలో 'నీరు అత్యధికంగా అవసరమయ్యే వరి పంటను చెరువులు, కాల్వల కింద ఉండే రైతులు మాత్రమే తమ భూముల్లో వేసుకోవాలి. మిగతా వారు కూరగాయల సాగు చేసుకుంటే మంచిది. అధిక వేడితోపాటు అత్యధిక నీటి వినియోగంతో భూగర్భ జలమట్టాలు పడిపోతే పంటలు చేతికిరావు. చివరికి తాగునీటికి ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉంటుంది' అని జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి ఎం.అశోక్ తెలిపారు.

నీటి లెక్క ఎలాగంటే..

2015లోనే జిల్లాలో గల సబ్‌స్టేషన్లు, పీహెచ్‌సీలు, ప్రభుత్వ పాఠశాలల్లోని 21 ప్రాంతాల్లో బోర్‌వెల్స్ 50 మీటర్ల మేర తవ్వారు. దీనికి రక్షణగా ఐరన్ బాక్స్ అమర్చి.. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే నెలకోసారి సంబంధిత అధికారులు ఫిజోమీటర్ సహకారంతో బోర్‌వెల్‌లో నిల్వ ఉన్న నీటిని కొలుస్తారు. దుగ్గొండి, నర్సంపేట, సంగెం, రాయపర్తిలో ఆటోమెటిక్ వాటర్ లెవల్ రికార్డింగ్ ద్వారా ప్రతీ 6 గంటలకోసారి అక్కడ ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ సహకారంతో నీటి నిల్వ ఎంత ఉందనేది తెలిసిపోతుంది.

ఈ మండలాల్లో ఇబ్బందికరం..

- నర్సంపేటలో గతేడాది మే నెలలో 5.66 మీటర్లలోతు ఉంటే.. ఆ తర్వాత వర్షాలు పడడంతో అక్టోబర్‌లో 1.70 మీటర్లపైకి నీరు చేరింది. సెప్టెంబర్‌లో 2.37 మీటర్లకు తగ్గింది. ఇప్పుడు వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, బోర్ల వినియోగం పెరగడంతో 3.68 మీటర్లకు నీటిమట్టం పడిపోయింది.
- పర్వతగిరిలో గతేడాది మే నెలలో 11.75 మీటర్ల లోతున భూగర్భ జలమట్టం ఉంటే.. ఆ తర్వాత కురిసిన వర్షాలతో అక్టోబర్‌లో 5.25 మీటర్లపైకి చేరింది. సాగు పనులు షురూ కావడంతో నవంబర్‌లో 5.39 మీటర్లు, డిసెంబర్‌లో 6.60 మీటర్లకు తగ్గింది.
- వర్ధన్నపేటలో గతేడాది మే నెలలో 7.76 మీటర్ల లోతున భూగర్భ జలమట్టం ఉంది. ఆ తర్వాత వర్షాలతో అక్టోబర్‌లో 4.97 మీటర్లకు చేరింది. వ్యవసాయ పనులతో మోటార్ల వినియోగంతో నవంబర్‌లో 5.44 మీటర్లు, డిసెంబర్‌లో 6.97 మీటర్లకు పడిపోయింది.

దళితుల కళ్లలో మట్టికొట్టింది కేసీఆర్ కాదా..



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్. పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు

- బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

ఖిలా వరంగల్: రాష్ట్రం ఏర్పడితే తొలి ముఖ్యమంత్రి దళితుడేనని చెప్పిన కేసీఆర్ అధికారంలోకి రాగానే తానే సీఎం అయి దళితుల కళ్లలో మట్టి కొట్టింది వాస్తవం కాదా అని బీజేపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురువారం వరంగల్ శివనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆనాటి ప్రభుత్వాలు దళిత బిడ్డలు బతికేందుకు అసైన్డ్ భూములు ఇస్తే.. నేడు కేసీఆర్ రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని తన చుట్టూ ఏర్పాటు చేసి నయానా.. భయానా చూపి దళిత భూములను కాజేస్తున్నారన్నారు. అధికార పార్టీకి ఊడిగం చేసేవారికే, ఎమ్మెల్యే తొత్తులకే దళిత బంధు పథకాన్ని ఇస్తున్నారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దొడ్డి దారిన దోచుకున్నది చాలక దేశాన్ని దోచుకోవడానికే బీఆర్ఎస్ పార్టీని పుట్టించారని ఆరోపించారు. ఆర్టీసీ సంస్థను మూడు వంతులు ప్రైవేటీకరణ చేసి సామాన్య ప్రజలు, కార్మికులకు కేసీఆర్ అన్యాయం చేయబోతున్నాడని ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచి ప్రజలతో ఛీకొట్టించుకున్న కేసీఆర్ దేశానికి ఏమీ న్యాయం చేస్తాడో ప్రజలే ఆలోచించాలన్నారు. కార్మిక, కర్షకులు, యువతను లిక్కర్‌కు బానిస చేసి ఎంతో మంది బిడ్డలకు కొడుకులను దూరం చేసిన మహనీయుడు కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. సమావేశంలో కుసుమ సతీష్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు 'స్తుతి' వేదికవ్వాలి

- నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు

కాజీపేట అర్బన్: నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు స్తుతి కార్యక్రమం వేదికగా నిలవాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్‌లో గురువారం సినర్జిస్టిక్స్ ట్రెయినింగ్ ప్రోగ్రాం యుటిలైజింగ్ ద సైంటిఫిక్ అండ్ టెక్నాలజికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(స్తుతి) కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఎవాల్యుయేషన్ ఆఫ్ మెటీరియల్ ప్రాపర్టీస్ అండర్ డైనమిక్ లోడింగ్' అంశంపై వారం రోజుల వర్క్‌షాప్‌నకు నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తక్కువ ఖర్చుతో పరిశోధనల రూపకల్పనకు సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సౌజన్యంతో స్తుతి సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్లు ఎస్.నరసయ్య, టీకే.సాయి, ఆరోఖ్యకుమార్, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు

చిరుధాన్యాల సాగు లాభదాయకం

- జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్

నెక్కొండ: చిరుధాన్యాల సాగుతో రైతులకు ఆదాయపరంగా లాభాలు ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023 కార్యక్రమాన్ని రెడ్లవాడ రైతు వేదికలో గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో చిరుధాన్యాలను సాగు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, భూసార పరిరక్షణ పెంపొందుతుందన్నారు. జొన్నలు, కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, అరికెలు, అండ్రుకొర్రలు, ఊదలు విరివిగా సాగు చేయాలని సూచించారు. బీడు భూములు, పనికిరాని ఖాళీగా ఉన్న నేలలు సైతం చిరుధాన్యాల సాగుకు అనుకూలమని ఆమె చెప్పారు. చిరుధాన్యాల్లో ఐరన్, జింక్, పాస్ఫరస్, పోషకాలు, పిండి పదార్థాలు, పీచు పదార్థాలు, ఆహార ధాన్యాల కంటే ఎక్కువగా ఉంటాయన్నారు. ఆయా పంటల కాలపరిమితులు, ఏయే రకాల విత్తనాలు విత్తుకోవాలి, దిగుబడి ఎంత శాతం ఉంటుందన్న వివరాలు రైతులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ రావుల శ్రీలత, ఎంపీటీసీ మాలోతు రవి, కేవీకే మామునూరు శాస్త్రవేత్త రాజు, ఏఓ ఎగిడి నాగరాజు, ఎస్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ పి.సారంగపాణి, ఏఈఓ రాజీవ్‌లోచన్, వసంత, వినేకర్, రంజిత్‌కుమార్, నాగరాజు, రాజేష్, ఉప సర్పంచ్ బర్ల వీరభద్రయ్య, రైతులు పాల్గొన్నారు.



రెడ్లవాడలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

లేబర్ ఆఫీస్‌కు తాళం

- 20 నెలలుగా చెల్లించని అద్దె
- తాళం వేసిన ఇంటి యజమాని

నర్సంపేట రూరల్: ఇరవై నెలలుగా ఇంటి అద్దె చెల్లించకపోవడంతో యజమాని కార్మిక శాఖ కార్యాలయానికి తాళం వేసిన సంఘటన నర్సంపేటలో గురువారం చోటుచేసుకుంది. పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయం(లేబర్ ఆఫీస్) అద్దె భవనంలో కొనసాగుతోంది. గురువారం కార్యాలయ అటెండర్ సతీష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవులు రోజువారీ విధుల్లో భాగంగా కార్యాలయానికి వచ్చారు. అయితే అప్పటికే ఇంటి యజమాని కార్యాలయానికి తాళం వేయడంతో సిబ్బంది అవాక్కయ్యారు. దీనిపై యజమానిని ప్రశ్నించగా.. రూ.3వేల చొప్పున 20 నెలలుగా అద్దె డబ్బులు రావాల్సి ఉందని తెలిపారు. అద్దె డబ్బులు చెల్లిస్తేనే తాళం తీస్తామని తేల్చి చెప్పారు. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించిన సిబ్బంది మధ్యాహ్నం వరకు అక్కడే వేచి చూశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన కార్మికులు తాళం వేసి ఉండటంతో చూసి వెళ్లిపోయారు. ఎట్టకేలకు ఇంటి యజమాని తాళం తీయడంతో కార్యాలయ సిబ్బంది లోపలికి వెళ్లి విధులు నిర్వర్తించారు. దీనిపై కార్మిక శాఖ అధికారి మహమూద్ అలీని వివరణ కోరగా.. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పి త్వరలోనే డబ్బులు ఖాతాలో వేస్తామని చెప్పడంతో ఆమె తాళం తీశారని వివరించారు.



తాళం వేసి ఉన్న కార్మిక శాఖ కార్యాలయం

రేపు రామప్ప ఫెస్టివల్

హన్మకొండ కల్చరల్: రామప్ప దేవాలయాన్ని 2021, జూలై 25న ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో ప్రకటించింది. అనంతరం కరోనా కారణంగా ఇందుకు సంబంధించిన వేడుకలు నిర్వహించలేదు. రామప్ప దేవాలయం విశ్వవ్యాప్తి పొందేందుకు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్ప ఫెస్టివల్‌ను ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ బీవీ పాపారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు కాళోజీ కళాక్షేత్రం పక్కన హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో రామప్ప ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కూచిపూడి, భారతనాట్య కళాకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ మల్లికా సారాబాయి శిష్య బృందంతో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు పాల్గొని రామప్ప ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కోరారు.

డిగ్రీ పరీక్షల్లో 26 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి డిగ్రీ పరీక్షల్లో గురువారం నిర్వహించిన పరీక్షల్లో 26 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల్లో వివిధ పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్‌లకు 26 మంది పట్టుబడి డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు జి.మధుకర్, ఎ.నరేందర్ తెలిపారు.

'వెలుగు' షురూ..

తొలిరోజు 4,901 మందికి కంటి పరీక్షలు

- 1,267 మందికి రీడింగ్ అద్దాల పంపిణీ
- ప్రిస్క్రిప్షన్ అద్దాల కోసం 993 మంది గుర్తింపు
- వివరాలు తప్పుగా నమోదు చేయడంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

గీసుకొండ: జిల్లావ్యాప్తంగా కంటి వెలుగు పరీక్షలు షురువయ్యాయి. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విస్తృతంగా ప్రచారం చేయడంతో ప్రజలు తొలిరోజు కంటి పరీక్షలు చేయించుకోవడానికి మొగ్గు చూపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేశారు. జిల్లాలో మొత్తం 44 బృందాలను ఏర్పాటు చేసి.. కంటి పరీక్ష శిబిరాలను గురువారం ఏర్పాటు చేయగా.. 4,901 మందికి పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 1,267 మందికి పరీక్ష శిబిరాల్లోనే రీడింగ్ అద్దాలను పంపిణీ చేయగా.. మరో 39 మందికి ఇవ్వాల్సి ఉంది. దగ్గరి చూపు కాకుండా దూరపు చూపు, ఇతర కంటి చూపు సమస్యలున్న 993 మందిని ప్రిస్క్రిప్షన్ అద్దాల కోసం గుర్తించారు. వారిలో అర్హులకు త్వరలోనే ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు. కాగా.. పరీక్షలు చేయించుకున్న వారిలో 2,620 మందికి కంటిచూపు సమస్యలు లేవని ఆయన పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రాయపర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించగా.. కలెక్టర్ గోపి, డీఎంహెచ్ఓ వెంకటరమణ పాల్గొన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మేడపల్లి, నల్లబెల్లి, నర్సంపేట రూరల్ మండలం ఇటుకాలపల్లిలో, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ 41వ డివిజన్‌లో, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ వర్ధన్నపేట మండలం చెన్నారం, వర్ధన్నపేట మున్సిపాలిటీలోని కోనాపురంలో, మేయర్ గుండు సుధారాణి 42వ డివిజన్‌లో ప్రారంభించారు. సంగెం పీహెచ్‌సీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ శ్రీవత్స కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు బైఫోకల్ అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసినట్లు వైద్యాధికారి అశోక్ తెలిపారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే గీసుకొండ మండలం వంచనగిరి, ఖానాపురం, నర్సంపేట రూరల్ మండలం భానోజీపేటలోని కంటి పరీక్ష శిబిరాలను సందర్శించి.. పలు సూచనలు చేశారు. వంచనగిరిలో బొల్లం వీరలక్ష్మి అనే మహిళకుచూపు సరిగా ఉన్నా.. వివరాలను తప్పుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఆమె వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ట్యాబ్ ద్వారా పరీక్షల వివరాలను నమోదు చేయకుండా.. సెల్‌ఫోన్‌లో చేయడం ఏమిటని ఆమె పీహెచ్‌సీ డాక్టర్‌ను ప్రశ్నించారు. దీంతో ఒకటే ట్యాబ్ ఉందని, సర్వర్ సరిగా పనిచేయడం లేదని తెలిపారు. పరీక్షలకు వచ్చే వారి వివరాలను సరిగా నమోదు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వంచనగిరిలో కంటి పరీక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

దేశంలోనే ఆదర్శంగా 'కంటి వెలుగు'

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, పక్కన కలెక్టర్ గోపి, డీఎంహెచ్ఓ తదితరులు

రాయపర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ బి.గోపితో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలు కంటి సమస్యతో బాధపడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ దూర దృష్టితో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మండలంలో 26 రోజులపాటు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 800 కళ్ల జోళ్లు ఇప్పటికే వచ్చాయని, ఇంకా అవసరమైతే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడితే పది రోజుల్లో వస్తాయన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలో ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, కాన్పుల కోసం ఖర్చుల పాలు కావొద్దనే ఉద్దేశంతో కేసీఆర్ కిట్ అందిస్తున్నట్లు చెప్పారు. ఎదురు పెట్టుబడి పెట్టి రైతుబంధు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఖమ్మం సభలో కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు తెలంగాణ పథకాలను మెచ్చుకున్నారని, దేశంలోనూ ఈ పథకాలను ప్రవేశపెట్టాలని కోరినట్లు తెలిపారన్నారు. అనంతరం చిన్నారులకు మంత్రి, కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో డీపీఓ కె.కల్పన, డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ, అడిషనల్ డైరెక్టర్ పుష్ప, జెడ్పీ సీఈఓ సాహితీమిత్ర, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహానాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులనూ పంపే యోచన!

డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం

- వివరాలు 10లో▸

ఓపీఎస్‌పై వ్యాఖ్యలు ఆక్షేపణీయం

హన్మకొండ అర్బన్: ఓల్ పెన్షన్ విధానం(ఓపీఎస్)ను రాష్ట్రాలు తీసుకొస్తే ఆర్థిక భారమన్న వ్యాఖ్యలు ఆక్షేపణీయమని సీపీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిపార్ట్‌మెంటల్ ఫోరం కన్వీనర్ దొడ్డిపాటి హరికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపీఎస్‌ను గత ప్రభుత్వాలే ఉద్యోగుల సంక్షేమానికి తీసుకొచ్చాయని, ఆర్థిక భారమంటూ ఆ విధానాన్ని ప్రభుత్వాలు ఎత్తేయడం సరికాదన్నారు. ఉద్యోగి సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించి ఉద్యోగ విరమణ అనంతరం బతుకును దుర్భరంగా గడపడం సమంజసమేనా? అని ఆయన ప్రశ్నించారు. ఓపీఎస్ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని పేర్కొన్నారు. ఓపీఎస్ అమలు చేసే రాష్ట్రాలకు ఆర్బీఐ ప్రకటన మోకాలడ్డేలా ఉందని, తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

టేకు కలపతో భార్య ప్రతిమ


టేకు కలపతో రూపొందించిన పకిరిబాయి ప్రతిమ

కురవి: చనిపోయిన భార్యకు గుర్తుగా ఆమె విగ్రహం తయారు చేయించడం చూస్తుంటాం. కానీ టేకు కలపతో భార్య ప్రతిమ చేయించాడు ఓ భర్త. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్యతండాకు చెందిన జాటోత్ వాల్యా.. భార్య పకిరిబాయి గత ఏడాది చనిపోయింది. ఆమెపై ఉన్న ప్రేమకు గుర్తుగా భర్త.. పకిరిబాయి ప్రతిమను టేకు కలపతో చేయించాడు. ఎడ్లబండిలో ఉన్నట్లు చెక్కించి ఇంట్లో ప్రతిష్ఠించాడు. కాగా, గురువారం వాల్యను మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శించి పకిరిబాయి ప్రతిమను ఆసక్తిగా తిలకించారు.

కొడుకుతో గొడవ పడి తల్లి ఆత్మహత్య

హసన్‌పర్తి: కొడుకుతో గొడవ పడి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. హసన్‌పర్తికి చెందిన పెద్దమ్మ సాంబలక్ష్మి(65)కి ఇద్దరు కుమారులు రవి, గణేష్ ఉన్నారు. సాంబలక్ష్మి పెద్ద కుమారుడు రవి వద్ద ఉంటుంది. గణేష్ అద్దె ఇంటిలో ఉంటున్నాడు. బుధవారం రాత్రి పెద్ద కుమారుడు రవి, తల్లి సాంబలక్ష్మికి మధ్య గొడవ జరిగింది. దీంతో మానసిక వేదనకు గురైన సాంబలక్ష్మి బాత్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చిన్న కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

9మందిపై చీటింగ్ కేసు నమోదు

ఖిలా వరంగల్: వాహనాల నంబర్ ప్లేట్లపై స్టిక్కర్ అతికించి, నంబర్లు కనిపించకుండా ట్యాంపరింగ్‌కు పాల్పడిన తొమ్మిది మంది వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. శంభునిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఎస్సైలు రాజబాబు, డేవిడ్, ఆర్‌ఎస్సైలు పూర్ణచందర్ రెడ్డి, శ్రవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

‘ఐటీ హబ్’కు నిర్లక్ష్యపు వైరస్

- 2013లోనే ఏర్పాటుకు అడుగులు
- 2017లో మొదటి కంపెనీ ప్రారంభం
- ఆరేళ్లలో వచ్చినవి నాలుగు కంపెనీలే..
- మౌలిక వసతుల లేమితో ముందుకు రాని కంపెనీలు



హన్మకొండ చౌరస్తా: వరంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యమనే వైరస్ పట్టింది. 1400పైగా ఐటీ కంపెనీలతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విరాజిల్లుతుంటే.. అంతే చరిత్ర కలిగి రాష్ట్ర రెండో రాజధానిగా చెప్పుకుంటున్న ఓరుగల్లు నగరం మాత్రం కేవలం నాలుగు కంపెనీలకే పరిమితమైంది. కంపెనీలు రాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో పురోగతి లేకపోవడమే కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఐటీకి కేరాఫ్‌గా వరంగల్ మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక స్వస్థలంలో సరైన అవకాశాలు లేక వరంగల్‌కు చెందిన వేల మంది యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు హైదరాబాద్, ముంబాయి, బెంగుళూరు వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. వరంగల్‌లో ఐటీ కంపెనీలు, స్టార్టప్ కంపెనీల పరిస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం.

2013లోనే అడుగులు..

వరంగల్‌కు ఐటీ రంగాన్ని తీసుకురావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య కాంక్షించారు. నగర శివారులోని మడికొండ ప్రాంతంలో ఐటీ కంపెనీలు స్థాపించేందుకు 2013లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ 2014లో 40 ఎకరాల స్థలాన్ని ఐటీ హబ్‌కు అనువుగా గుర్తించింది. అదే సమయంలో మరో 100 ఎకరాలు అవసరమని ప్రభుత్వాన్ని కోరారు. ఇంతలోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, ప్రభుత్వాలు మారడంతో ప్రతిపాదనలు మూలకుపడ్డాయి.

2017లో మొదటి కంపెనీ..

2014లో ఐటీ పార్కుకు అడుగులు పడగా మూడేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత 2017 జనవరి 22న మొదటి ఐటీ కంపెనీ సీయెంట్ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైంది. నాలుగెకరాల స్థలంలో కొనసాగుతున్న ఈ కంపెనీలో ప్రస్తుతం 250 వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మ్యానుఫ్యాక్చరింగ్, టెలీ కమ్యూనికేషన్ సేవలను సీయెంట్ కంపెనీ అందిస్తోంది.

మౌలిక వసతులు కల్పిస్తేనే..

కొత్త కంపెనీలు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మౌలిక వసతులు లేకపోవడం. పార్కులో రోడ్లు, డ్రైనేజీ, నీటి వనరులు లేకపోవడం వల్లే కొత్త కంపెనీలు ఆసక్తి చూపడం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికితోడు మొదట్లో గజానికి రూ.700 ధర నిర్ణయించిన ప్రభుత్వం ప్రస్తుతం రూ.2000 చొప్పున వసూలు చేస్తూ కేవలం 30 ఏళ్ల లీజు నిబంధన పెట్టింది. దీంతో కంపెనీలు వెనుకడుగు వేస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

ఆరేళ్లలో వచ్చినవి నాలుగే..

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పిన పాలకులు చేతల్లో విఫలమయ్యారనే విమర్శలు ఘాటుగా వినిపిస్తున్నాయి. గడిచిన ఆరేళ్లలో నగరానికి కేవలం మూడు ఐటీ కంపెనీలే వచ్చాయి. అందులో ఒకటి సీయెంట్ కాగా వెంటాయిస్, కాకతీయ టెక్నాలజీ కంపెనీలతో పాటు టెక్ మహీంద్ర కంపెనీ మడికొండ ఐటీ పార్కులో నిర్మాణంలో ఉన్న ఇంక్యుబేషన్ టవర్‌లో కొనసాగుతుంది. వీటి తర్వాత ఏ ఒక్క కార్పొరేట్ ఐటీ కంపెనీ కూడా వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు సుముఖత చూపలేదు.

వరంగల్‌పై సవతి తల్లి ప్రేమ..



“త్వరలో వరంగల్ నగరానికి ఐటీ దిగ్గజ కంపెనీలు వస్తాయని వేదికలపై ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చెప్పిన వ్యాఖ్యలు మాటలకే పరిమితమయ్యాయి. వరంగల్‌పై కేసీఆర్ సర్కార్‌ది కేవలం సవతి తల్లి ప్రేమే అని తేలిపోయింది. అందుకు నగరంలో నడుస్తున్న నాలుగు కంపెనీలే ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఐటీ పార్కులో వసతులు కల్పించి కొత్త కంపెనీలను తీసుకురావాలి.

\- పుల్లూరు సుధాకర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు

ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి



వరంగల్ నగరంలో 30 నుంచి 40 వరకు స్టార్టప్ కంపెనీలు ఉన్నాయి. వాటికి ప్రభుత్వం తరఫున ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి. జీఎస్టీలో రీయింబర్స్‌మెంట్, రాయితీపై రుణాలు, ఐటీ పార్కు లీజు కాలాన్ని మరింత పెంచి ధరను తగ్గించి స్టార్టప్ కంపెనీలకు ఇవ్వాలి. ప్రభుత్వ ప్రాజెక్టులలో స్టార్టప్ కంపెనీలను భాగస్వామ్యం చేయాలి.

\- అడెపు వెంకటేశ్, ఎస్‌వీ యాప్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ చైర్మన్, హనుమకొండ

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. హుండీ తాళాన్ని తొలగించి పక్కనే ఉన్న చెరువు కట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ గొడ్డలి సాయంతో హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఆలయంలోకి వెళ్లిన అర్చకులు హుండీ చోరీకి గురైనట్లు గమనించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తిరుపతి చేరుకొని క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని హుండీ, గొడ్డలిపై ఉన్న వేలిముద్రలు సేకరించారు. జాగిలంతో ఆలయ ప్రాంగణంతో పాటు చెరువు కట్టపై వెతికారు. కాగా, పక్కనే ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న వారు బయటకు రాకుండా దొంగలు బయటి నుంచి గొళ్లెం పెట్టారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో రెండుసార్లు ఇదే ఆలయంలో హుండీ చోరీకి గురైంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని కానిస్టేబుల్ మృతి

- ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా నరేష్ విధులు
- ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత, అంతలోనే విషాదం


నరేష్ (ఫైల్)

నడికూడ: రోడ్డు ప్రమాదంలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పరకాల పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన బండి నరేష్(28)ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ జిల్లాలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల క్రితం ఎస్సై ఈవెంట్స్ కోసం సెలువుపై గ్రామానికి వచ్చాడు. ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత కూడా సాధించాడు. గురువారం బైక్‌పై వెళ్లి చర్లపల్లిలోని బంధువులను కలిశాడు. అక్కడ నుంచి పులిగిల్లలో బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చర్లపల్లి గ్రామ శివారులో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరేష్ తల్లిని ఓదార్చారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..


మల్లయ్య మృతదేహం

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన అంబటి మల్లయ్య(60) అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రవినగర్ శివారు మంగళికుంట సమీపంలో మల్లయ్యకు ఎకరం పొలం ఉంది. గురువారం పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న బోరు మోటార్ తీగ తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

స్టార్టర్ ఆన్ చేస్తూ మరొకరు..


రవి మృతదేహం

కురవి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయితండాలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బంచరాయితండాకు చెందిన బానోత్ రవి(40) అనే రైతు అదే గ్రామానికి చెందిన నారాయణ అనే రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గురువారం ఏటి ఒడ్డున ఉన్న పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో కింద పడి కొట్టుకుంటుండగా పక్క పొలం రైతులు, తండావాసులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రవిని వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ విషయమై ఎస్సై బి.రామును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చెరువులో పడి మహిళ..

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామానికి చెందిన చెరుకుల సూరమ్మ(52) గ్రామ సమీపంలోని పెద్దచెరువులో పడి మృతి చెందింది. ఏఎస్సై అబ్బయ్య కథనం ప్రకారం.. కొంతకాలంగా సూరమ్మ మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రవర్తిస్తోంది. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. గతంలో ఇంటి నుంచి వెళ్లి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో ఉండి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేది. దీంతో ఎక్కడో ఓ చోట ఉండి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. కాగా, తిమ్మంపేటకు చెందిన రైతు గుండు నర్సయ్య గురువారం చెరువు వద్దకు వెళ్లగా నీటిలో మహిళ మృతదేహం కనిపించింది. విషయాన్ని బాలన్నగూడెం గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు చేరుకుని సూరమ్మ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మిర్చి కల్లంలో కూలీగా..



వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి గురువారం శాయంపేట మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భూపాలపల్లికి వెళ్తున్న క్రమంలో రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి–నిజాంపల్లి శివారులో మిర్చి ఏరుతున్న కూలీలను చూసి వాహనాన్ని ఆపారు. కూలీలతో కలిసి కొంతసేపు తాలు మిర్చి ఏరి మహిళా కూలీల బాగోగులు తెలుసుకున్నారు.

\- టేకుమట్ల(రేగొండ)

ఖమ్మం సభ గ్రాండ్ సక్సెస్

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్నమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

హన్మకొండ: ఖమ్మంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేసుకుంటే 6 లక్షలకు పైగా వచ్చారని, నాలుగు గంటలు వేచిఉండి సీఎం కేసీఆర్, వచ్చిన అతిథులు ప్రసంగాలు ఓపికగా విన్నారని, సభాస్థలి బయట లక్షన్నర మంది ఉండిపోయారన్నారు. సభకు తరలివచ్చిన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హనుమకొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమంతా సీఎం కేసీఆర్ వైపు చూస్తుందని, తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరుకుంటున్నారన్నారు. మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సభను చూసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిచ్చి కూతలు కూస్తున్నారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని తూర్పారబట్టారు. ముందుగా కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కంటి వెలుగులో పరీక్షలు చేయించుకుని అద్దాలు పెట్టుకుని చూస్తే ఇక్కడి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కనిపిస్తాయన్నారు. బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్ మాట్లాడుతూ ఖమ్మం బీఆర్‌ఎస్ సభ కొత్త చరిత్రకు నాంది అని అన్నారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్, మేయర్ గుండు సుధారాణి, నాయకులు లలితా యాదవ్, గాంధీ నాయక్, యాకూబ్ రెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

వర్ధన్నపేట: వీధి కుక్కల దాడిలో 7 గొర్రెలు మృతి చెందాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు అమరాజు స్వామి కథనం ప్రకారం.. చెన్నారం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరు కాగా, అమరాజు స్వామి కుటుంబ సభ్యులు పాల్గొని ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో వీధి కుక్కలు వెంట పడడంతో పరిగెత్తి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న గొర్రెల షెడ్డులోకి వెళ్లిన వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేయడంతో 7 మృతి చెందాయి. దీంతో రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయాడు. గ్రామంలో కుక్కల బెడద ఉందని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందించాలని కోరాడు.

ధర్మకర్తల మండలి నియామక జీఓ సస్పెన్షన్

- 11న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- కోర్టు వెబ్‌సైట్‌లో ఉత్తర్వులు

ఐనవోలు: ఐనవోలు ఆలయ ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వుల జీఓ నంబర్ 11ను సస్పెన్షన్ చేస్తూ ఈ నెల 11న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, హైకోర్టుకు సెలవులు ఉండడంతో ఉత్తర్వుల ప్రతులు బుధవారం రాత్రి హైకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. కాగా, ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయ ట్రస్టు బోర్డు నియామకానికి డిసెంబర్ 15న నోటిఫికేషన్ వెలువడింది. 20 రోజులపాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జనవరి 5తో గడువు ముగియడంతో ఈ నెల 10న ఎండోమెంట్ కమిషనర్ 14 మంది సభ్యులు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో హనుమకొండకు చెందిన పైల శ్రీనివాసులు అనే వ్యక్తి నియమ నిబంధనలు పాటించకుండా ఎండోమెంట్ కమిషనర్ జీఓ 11 వెలువరించారని, జీఓను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 11న జీఓను సస్పెన్షన్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులు ఫిబ్రవరి 8 వరకు కౌంటర్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ఆరుగురి నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

మహదేవపూర్: ఛత్తీస్‌గఢ్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న కాళేశ్వరం అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పల్సర్ బైక్ వచ్చిన షారుక్‌ఖాన్, మారెపల్లి మల్లేష్ అనుమానాస్పదంగా కనిపించడంతో సోదాలు చేశారు. వారి వద్ద 1,300 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టుకు తీసుకెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రానికి చేరుకోగానే షారుక్‌ఖాన్ పోలీసులను నెట్టివేసి పరారయ్యాడు. దీంతో ఎస్పీ సురేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈనెల 18న పలిమెల మండలంలో వాహనాల తనిఖీ చేస్తుండగా షారుక్‌ఖాన్‌తో పాటు పేరుక రాజకుమార్, సడల సురేందర్, జన్నే రాజశేఖర్, ఆముదాల కార్తీక్ గంజాయితో పట్టుబడ్డారు. విచారణలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన చాందినీఖాన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు ఆమె వద్ద సుమారు 2 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భూపాలపల్లిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎండి షారుక్‌ఖాన్, గణపురం మండలం చెల్పూర్‌కు చెందిన ఆముదాల కార్తీక్, పేరుక రాజకుమార్, కొంపల్లికి చెందిన సడల సురేందర్, గొర్లవీడుకు చెందిన జన్నే రాజశేఖర్, బీజాపూర్‌కు చెందిన చాందినీఖాన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు లక్ష్మణ్‌రావు, అరుణ్, రాజ్‌కుమార్, ఏఎస్సైలు మల్లేశ్వర్, నాగయ్య, పీసీలు బాల్‌సింగ్, కిరణ్, సంతోష్, ధనుంజయ్, సమ్మయ్య, దేవేందర్, శ్యామ్, తిరుపతి, అన్వేష్, వేణు, లావణ్య, శిరీష, స్వాతిలను డీఎస్పీ అభినందించారు.

జీపీ స్థల విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- కత్తులతో దాడి.. ఇద్దరికి గాయాలు
- బుర్రకాయలగూడెంలో ఘటన


గాయపడిన నాను, రవీందర్

గణపురం: నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గం వారు మరో వర్గంపై కత్తులతో దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుర్రకాయలగూడెంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. బుర్రకాయలగూడెం జీపీ భవన నిర్మాణం కోసం తహసీల్దార్ సతీష్‌కుమార్ 10 గుంటల భూమి కేటాయించారు. భవన నిర్మాణాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం(నేడు) ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో గురువారం శిలాఫలకం పనులు చేస్తుండగా స్థలం తమదంటూ ఎంపీటీసీ కాలియా సాగర్, ప్రవీణ్, శ్రీబాబు, కాలియా గోపాల్ అడ్డుకున్నారు. పనులు చేయిస్తున్న తుమ్మల నాను, తుమ్మల రవీందర్‌తో గొడవకు దిగి కత్తులతో దాడి చేశారు. దీంతో నాను, రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్, ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

చెన్నారావుపేట: అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన గోపగాని సాయిచరణ్ ఈ నెల 15న తన పల్సర్ బైక్‌పై చెన్నారావుపేట మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో గల అత్తగారింటి నుంచి నర్సంపేటకు వెళ్తున్నాడు. పార్క్‌లైన్ వైన్ షాపు వద్దకు రాగానే నర్సంపేటకు చెందిన గ్యార శ్రీకాంత్ తన ఎర్టిగా వాహనంతో వేగంగా దూసుకొచ్చి అకస్మాత్తుగా రోడ్డుపై ఆపాడు. దీంతో పల్సర్ బండిపై వస్తున్న సాయిచరణ్ కారును ఢీకొట్టి కిందపడిపోయాడు. అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా వాహనం నడిపిన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.